మా ఆఫీస్‌లో అంతమంది స్టాఫ్ ఉన్నా ఎవరూ నాకంత దగ్గరగా రాలేకపోయారు. బహుశా ఇందులో నా లోపమే ఎక్కువనుకుంటాను.

నాతో కలిపి నలుగురు సెక్షనాఫీసర్లం ఉన్నాము. నా కొలీగ్ వామనరావు నా ఫ్రెండ్. ఇది మా ఇద్దరిమధ్యే ఆగిపోలేదు.

అప్పుడప్పుడు నా భార్య భారతిని తీసుకుని వాళ్ళింటి కెళ్ళేవాడిని. మాకు ఇద్దరు పిల్లలు. బాబు వాళ్ళ అమ్మమ్మ గారింట్లో ఉండి చదువుకుంటున్నాడు. పాప దేవసేన మా దగ్గరుంటుంది.

వామనరావుకింకా పిల్లల్లేరు. అతని భార్య అరుణతో కలిసి దాదాపు ప్రతి సండే మా ఇంటికొచ్చేవాడు. వాళ్ళిద్దరూ కలిసి నడుస్తుంటే తమాషాగా ఉంటుంది. మనుషుల ఆకారాల్నిబట్టి పేర్లు పెట్టే ఆచారం మనకేం లేదు. ఆంజనేయులని పేరు పెట్టుకున్న ప్రతివాడూ కోతిలాగాను. రాజా అని పేరు పెట్టుకున్న వాడు రాజకుమారుడిలాగాను ... జానకమ్మ పేరున్నవాళ్ళంతా జానకంత పవిత్రులుగానూ కూడా ఉండరు. అలాగే వామనరావు పొట్టిగా ఉండడు.

ఆరడుగుల పొడవుతో. పాతేసిన జండా కొయ్యలాగా వుంటాడు.

అరుణ పొట్టిగా వుంటుంది. అతని నడుం దాకా వస్తుంది నుంచుంటే. అతన్ని చూడాలంటే కళ్ళెత్తి, ఆమెను చూడాలంటే కళ్ళు దించీ చూడాల్సిందే.

చూడటానికి పిట్టలాగే వున్నా అరుణ అఖండురాలు. ఆమెకు మంచి టాకింగ్ పవరుంది. అందరినీ డామినేట్ చేస్తుంటుంది.

తనను డామినేట్ చేసే వాళ్ళెవరన్నా తగిలితే మాత్రం మౌనంగా, అసహనంగా ఉంటుంది. వాళ్ళతో ఫ్రీగా మాట్లాడదు. తన మాటలకు ఎదురు చెప్పని వాళ్ళంటేనే ఆమెకిష్టం.

మా భారతి బాగా అందగత్తె, నెమ్మదస్తురాలు. అయితే, చాలా తెలివైనది, చురుకైనది. పైకి మాత్రం నెమ్మదిగా ప్రవహించే నదిలా ఉంటుంది.

అరుణ మాకంత సన్నిహితంగా ఉండటానికి కారణం, బహుశా భారతి మెతకదనమే కావచ్చు.




నా భార్య అందం గురించీ, తెలివి గురించీ డబ్బా కొట్టే హాబీ నాకు లేకపోవటం కూడా ఇంకో కారణం కావచ్చు. మా ఆఫీస్‌కి రాజారావనే సెక్షనాఫీసర్ స్థానంలో విశ్వమోహన్ అనే యువకుడు విజయనగరంనుంచి బదిలీ అయి వచ్చాడు. అతనికి కొత్తగా పెళ్ళయింది. భార్యది ఈ ఊరే.

మనిషి తెల్లగా, పొడుగ్గా చువ్వలా వుంటాడు. సరదాగా చొరవగా మాట్లాడతాడు డిగ్నిఫైడ్‌గా కనపడతాడు.

అతనెలాగో వామనరావుకన్నా స్వల్ప వ్యవధిలోనే నాకు చేరువయ్యాడు. నేనతన్ని విశ్వం అని పిలుస్తాను. ఒకసారి తను నన్ను వాళ్ళింటికి తీసికెళ్ళాడు.

వాళ్ళ మావగారు రాజకీయాలు మాట్లాడటం మొదలెట్టారంటే ఓ పట్టాన ఇవతలికి రాడు. ఎదురుగా వున్నవాణ్ణి యమా దంచుడు దంచుతాడు.

నాకూ అవంటే పిచ్చి. అందుకని అప్పుడప్పుడాయనదగ్గరకు పోయి గంటల తరబడి హస్కువేసుకూర్చునేవాణ్ణి.

ఓ రోజు విశ్వాన్ని మా యింటికి తీసుకొచ్చి భారతికి పరిచయం చేశాను

"కూర్చోండి. ఎక్కడ మీరుండేది?" అన్నది భారతి.

"మా అత్తగారింట్లో."

భారతి కనుబొమ్మలు ఆసక్తిగా పైకి లేచాయి.

అది చూసి నవ్వుతూ, "మా అత్తవారిదీవూరేనండీ. మా అమ్మాయికంతా కొత్త—వంట చెయ్యటం కూడా రాదు—మాది పెద్ద ఇల్లు—మీరుకూడా ఈ ఇంట్లోనే రెండుగదులు తీసుకుని ఉండండి" అని వాళ్ళు బలవంతం చేశారు. నా భార్య రేణుకకూడా విడిగా ఉండటానికింట్రెస్ట్ చూపకపోవటంతో— సరే కొన్నాళ్ళిది చూద్దామని అక్కడే తిష్టవేసేశాను." అన్నాడతను.

* * * *

ఒకసారి తన భార్య రేణుకను తీసుకొచ్చాడు విశ్వం. "భారతిగారూ.. మా రేణుకకు ఏదీ సరిగ్గా చాతకాదు. కనీసం.. గెస్ట్‌లు వస్తే ఎలా రిసీవ్ చేసుకోవాలో, ఎలా ట్రీట్ చెయ్యాలో కూడా తెలీదు. మీరు అన్నీ నేర్పి ఆమెను మీలా తయారు చెయ్యాలి." అన్నాడతను.

"ముందు మీకు క్లాస్ తీసుకోవాలి— భార్యను పరాయి ఆడదాని ముందు ఏమీ తెలియని దానిగా చిత్రించి తక్కువచేసి మాట్లాడకుండా" అన్నది భారతి.

"చచ్చాం. నేనేదో మంచికిపోతే అది కాస్తా నా పీకకే చుట్టారే!" అంటూ నవ్వాడు విశ్వం.

రేణుక మా అందరితోనూ బాగానే మాట్లాడింది.

క్యారమ్స్ ఆడుతున్నాం. మా ఇద్దరికన్నా భారతి, రేణుక బాగా ఆడుతున్నారు.

"నేను బ్రెయిన్ వాష్‌చేసి మరీ తీసుకొచ్చానీవిడని. మధు గారితో కూడా క్లోజ్‌గా ఉండాలని. పరాయి మగవాణ్ణి చూడగానే గొంగళి పురుగులా ముడుచుకుపోతే వాళ్ళు నవ్వుతారని........"

మధ్య మధ్యలో తన భార్య గురించి చెపుతున్నాడు విశ్వం.

విశ్వం తరుచుగా మా ఇంటికొస్తుండేవాడు. భారతంటే అతనికి చచ్చేంత అభిమానం.గౌరవం. ఆమె అంటే ఓ గొప్ప ఇమేజ్.

“నాకు మీలాంటి అక్క ఉంటే....” అనేవాడు.

“ఇప్పుడు మాత్రమేం? అలాగే అనుకోండి”అనేది భారతి.

భారతి ప్రయివేటుగా బి.కాం.కి కడుతోంది.

విశ్వం అకౌంట్సు చెప్పేవాడు.

భారతి కూడా అతనితో క్లోజ్‌గా వుండేది. విశ్వం వరసగా నాలుగైదు రోజులు రాకపోతే ఏదో పోగొట్టుకున్నట్లుగా ఫీలయ్యేది.

ఆడవాళ్ళకి ఓ బలహీనత వుంది. ఎవరైనా మగాడు “నేను నీ తమ్ముడిలాంటి వాణ్ణి” అంటే చాలా వరకు అనుమానాలు, సంకోచాలు వదిలేసి అతనికి దగ్గరవుతారు. అలా అన్న మగాడి మీద వాళ్ళకి గొప్ప కాన్ఫిడెన్స్ ఏర్పడిపోతుందన్నమాట.

వామనరావు అరుణ వచ్చినప్పుడు చాలాసార్లు విశ్వం మా ఇంట్లో కనబడేవాడు వాళ్ళకి. దేవసేనతో ఆడుకుంటూ వుండేవాడు.

విశ్వం మాకు వాళ్ళకన్నా సన్నిహితమవుతున్నాడేమో అనే ఆలోచన వామనరావులో లేకపోయినా ఆ బాధ అరుణలో వున్నట్లు చూచాయగా పసిగట్టాను నేను.

“రేణుకగార్ని మీతో ఎప్పుడూ తీసుకురారేం? మీ రొక్కరే కనిపిస్తారు?” అదోలా అన్నది అరుణ.



"ఆవిడా వస్తూనే వుంటుంది. అయితే నా అంత ఎక్కువగాకాదు. తనకింకా కొత్త. అదీకాక మా ఇల్లు దూరం. నేనయితే సైకిలు మీద వచ్చేస్తూ వుంటాను. తను రావాలంటే.... ఉదయం చెపితేనేగానీ సాయంత్రానికి రెడీ అవలేదావిడ" అన్నాడు విశ్వం.

వెళ్ళేటప్పుడు రేణుకను తీసుకుని వాళ్ళింటికి రమ్మని మరీ మరీ చెప్పింది అరుణ విశ్వంతో.

"ఎలాగయినా.. అరుణగారంటే నాకు మంచి అభిప్రాయం ఏర్పడలేదు" అన్నాడు విశ్వం వాళ్ళు వెళ్ళిపోయాక.

"ఛ! ఆవిడ మంచిదేనండీ. వాళ్ళెప్పట్నుంచో తెలుసు మాకు" అన్నది భారతి.

"సరే మీ నోట్సు తెచ్చుకోండి."

"టీ పెట్టుకొస్తాను"

"ఇప్పుడేగా కాఫీ తాగాం? మీరిలా గంట గంటకీ ఏదో ఒకటి పోస్తుంటే దృష్టి అకౌంట్సు చెప్పటం మీదికన్నా ఈసారేం పోస్తారా అనే దానిమీదే ఎక్కువ పనిచేస్తుంది."

"ఉత్సాహము రావలెనంటే టీ తాగవలెను" అంటూ కప్పు అందించిందామె

"ఉత్సాహమునకు టీయే అవసరము లేదు మీతో మాట్లాడినా వచ్చును."


"ఏడిసినట్లుంది మీ నస. ఆ అకౌంట్సేవో త్వరగా తెముల్చండి పిక్చర్‌కి పోదాం" అన్నాను నేను.

"నాన్నా....ఏం పిక్చరు? అందులో ఫైటింగుందా? ఎన్ని సార్లు?" అంటూ వచ్చి నన్ను చుట్టేసింది దేవసేన. మేమిద్దరం కబుర్లలో పడిపోయాం.

* * *

"నిన్న మా ఇంటికి అరుణగారు వచ్చార్ట. ఎంతో ఇదిగా మాట్లాడి, రేణుకను వాళ్ళింటికి తీసికెళ్ళార్ట మధ్యాహ్నం నుంచీ సాయంత్రం దాకా రేణూ. వాళ్ళింట్లోనే ఉన్నదట! మొత్తానికి ఈ అరుణ గొప్ప కాంప్లికేటెడ్ ఉమన్‌లాగే ఉంది. నేను వాళ్ళిద్దర్నీ ఒకరికొకర్ని పరిచయం చెయ్యనేలేదు మరీ అంత అతి చనువు ఇవ్వకుండానే తీసుకునే వాళ్ళంటే నాకు చిరాకు" అన్నాడు విశ్వం.

"ఎందుకు మీ కావిడంటే అంత ఎలర్జీ? ఆమెకేం తోచక మీ ఇంటికొచ్చి వుండొచ్చు. వచ్చిందిగదా అని రేణుకను తీసికెళ్ళి వుండొచ్చు" ఆరిన బట్టలు చక్కగా మడతలుపెట్టి అలమర్లో పేరుస్తూ అన్నది భారతి.




"మీరు ఇల్లు చాలా నీట్‌గా వుంచుతారు" అభినందనగా అన్నాడతను.

"ఓసంగతి చెప్పనా?"

"చెప్పండి."

"మీరు నా గురించి మీ ఆవిడ దగ్గర బాగా పొగుడుతారు కదూ?"

"పొగడట మేమిటీ? ఉన్నమాటే చెపుతాను. విన్నైనా నేర్చుకుంటుంది గదా."

"నిజంగా మీ మగాళ్ళు ఉట్టి బుద్ధావతారాలు. ఆడవాళ్ళ గురించి అన్నీ తెలుసనుకునే.... ఏమీ తెలియని అమాయకులు.

పరాయి ఆడదాని గురించి నిజాలే చెప్పినా.... అవి ఆమెను మెచ్చుకునేలా వుంటేమటుకు ఏ భార్యా సహించదు. ఆ చెప్పటంలో గల అతని ఉద్దేశ్యాన్ని అర్థంచేసుకోటం మానేసి. అతని ఇంట్రెస్టును అంచనా వెయ్యటం మొదలెడుతుంది.

అందుకే.... నా గురించి మీరు రేణుక దగ్గర అస్తమానం పొగడటం ప్రారంభించటంతో ఆమె మనసులో నేనంటే ఒక వ్యతిరేక భావన ఏర్పడి వుంటుంది. అది సహజం కూడా.

అరుణను గురించి మీరేం చెప్పరు. ఆమె సరాసరి వచ్చి మీ భార్యతో పరిచయం చేసుకుంది. రేణూని బాగా పొగిడి. ఆమె ప్రతి చర్యనూ మెచ్చుకుని వుంటుంది అరుణ.

నేనంటే ఉన్న నెగెటివ్ భావన రేణూని ఆటోమేటిగ్గా అరుణ వేపు తోసి వుంటుంది. దాంతో అరుణ ఆమెకు పరమ ఆత్మీయంగా అనిపించి. అంతసేపు వాళ్ళింట్లో ఫ్రీగా గడపగలిగి ఉంటుంది.

రేణు ఇక్కడికి రాగానే "పోదాం.... పోదాం" అనటానికి కారణం ఇక్కడికి రావటానికి విముఖత చూపటం. ఇదంతా అసంకల్పితంగా మీరు కల్పించిన దూరమే.

తన భర్త అభిమానించే ఏ ఆడదాన్నయినా భార్య శత్రువు లాగే భావిస్తుంది. పైకి చెప్పకపోయినా .... మనసు పొరల్లో ఈ భావన నిక్షిప్తమయే ఉంటుంది.

"మీరు నాగురించి రేణుకదగ్గరమాట్లాడటం మానెయ్యండి" సలహా ఇస్తున్నట్లుగా అన్నది భారతి.

* * *

విశ్వం కోరిక మీద భారతిని తీసుకుని వాళ్ళింటి కెళ్ళాను. ఆడవాళ్ళంతా వంటింట్లో కూర్చున్నారు.

నేను మామూలుగా విశ్వం మావగారితో చర్చలు కొనసాగిస్తూ కూర్చున్నాను.

ఇంటికొచ్చేటప్పుడు భారతెందుకో ముభావంగా ఉంది. ఇంటికిరాగానే రెండు చేతులూ జోడించి "రామచంద్ర ప్రభో...." అంటోంది.

"వాడెవడు మధ్యలో? నేను మధుసూధన ప్రభువనుకుంటాను?" కాస్త హాస్యాన్ని ఒలికించాను.

"మీ జోకు తగలడ్డట్టే ఉంది. నవ్వాలనిపించటంలేదు.. నాలుగు వాయించాలనిపిస్తోంది."

ఎందుకయినా మంచిదని దూరంగా జరుగుతూ "ఏమయింది?" అన్నాను.

"రేణూ వాళ్ళమ్మ. నాయనమ్మా కలిసి నన్ను తినేశారు. ఫుల్‌స్టాప్ లేకుంటే పీడా పోయింది. కనీసం కామా అన్నా లేదు! అక్కడున్న అరగంటలో అరవై ఆరు సార్లన్నా అరుణను పొగిడి.. ఆ ముచ్చట్లే చెప్పి బోరెత్తించేశారు.........."

"ఐసీ! అదా నీ జెలసీ?"

"జెలసీయా నా బొందా! ఏ టాపిక్ తీసుకున్నా అంతే ఆ మాట్లాడటానికో తీరు తెన్నూ లేదు. మీదపడి బాదేసినట్లే.

ఎదుటివాళ్ళు వింటున్నారా, లేదా అనయినా చూసుకోకుండా ఏనక ఛస్తారా అన్నంత ధీమాతో ఒకరికన్నా ఒకరు ముందు చెప్పాలనే తాపత్రయంతో ఇద్దరూ ఒకేసారి యుగళగీతంలా మాట్లాడేస్తూ అబ్బ! ఊపిరి తిప్పుకోలేకపోయాను" అంటూ మంచం మీద కూలబడింది భారతి "దేవసేనా" అని.

"ఏంటమ్మా అమృతాంజనం ఇవ్వనా?" అన్నదది ఫక్కున నవ్వాం ఇద్దరం.

చెప్పొద్దూ దాని అవగాహనకి నాక్కాస్త గర్వం కూడా కలిగింది.

కాలర్ పైకి ఎత్తబోయి ...అమృతాంజనం నుదుటికి ఎడాపెడా పట్టిస్తూ కళ్ళు మూసుకున్న భారతిని చూసి కిక్కురుమనకుండా పడుకున్నాను.

*　　*　　*

"వామనమూర్తి ఉన్నాడాండీ?" టీపాయ్ మీద పేపరందుకుని కుర్చీలో కూర్చుంటూ అడిగాను.

"స్నానం చేస్తున్నారు. చెపుతానుండండి మీ రొచ్చారని." అంటూ లోపలికెళ్ళింది అరుణ.

పేపర్లో హెడ్‌లైన్స్ చూస్తున్నాను....

"ఏం గురూ.ఏంటి సంగతులు" లుంగీ కట్టుకుంటూ కళ్ళెగరేశాడు వామనమూర్తి

"ఏం లేదోయ్ విశ్వం ఇంటికెడుతూ ఓమాటు తొంగిచూసి పోదామనొచ్చాను."

"నేనో మాట చెప్తతాను.ఏమీ అనుకోనని మాటివ్వాలి" చెయ్యి చాపి సీరియస్‌గా అన్నాడతను.

"సంగతేమిటో చెప్పకుండానే మాటిచ్చెయ్యమని డిమాండ్ చెయ్యటం దారుణం." చాపిన చెయ్యివంక చూస్తూ అన్నాను నేను.

"నువ్వు....నువ్వు విశ్వం ఇంటికెళ్ళకు." నెర్వస్‌గా మొహం తుడుచుకుంటూ అన్నాడతను.

"వ్హాట్! ఎందుకని!"


"చెప్పితీరాలా?"

"సస్పెన్స్ అనేది మరీ ఇంత లాగుడుగా ఉంటే బాగోదు".

"ఖర్మ! నువ్వు ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోవు. నీతో ఇదే వచ్చిన చిక్కు! నువ్వు వెళ్ళకు. అంతే. ఇంక నేనేం చెప్పలేను. నామీద గౌరవముంటే వెళ్ళకు."

"కారణం చెప్పకుండా నువ్వీపని చెయ్యొద్దు అంటే.... తప్పకుండా దాన్ని చేసి తీరేవాడే మానవుడు"

"మధూ....




"యస్!"

అంతదాకా ఎలాగో ఓపిక పట్టిన అరుణ ఇహ ఆ.పోయింది.

"ఏమిటండీ అలా నానుస్తారు? చెప్పకపోతే ఎలా తెలుస్తుంది? అది కాదన్నయ్యా! విశ్వమోహన్‌కి, భారతికి ఏదో అక్రమ సంబంధముంది అనుకుంటున్నారట...."

"ఎవరా ఇడియట్స్?" అరుణను మధ్యలోనే ఆపుతూ ఎర్రబడ్డ ముఖంతో అన్నాను.

విషయం ఇదీ అని కనీసం నేను ఊహించనుకూడా లేదు...

"ఎవరో అయితే ఇంక గొడవెందుకు?రేణుకా. ఆమె తల్లీ. నాయనమ్మా. వాళ్ళు ముగ్గురూ కలిసి నిన్న విశ్వంమీద పెద్ద ఎత్తున యుద్ధం చేశారట అతను అలిగి నిన్నటున్నించీ ఆ ఇంట్లో పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టటం లేదట ఈ టెన్షన్‌లో మీ రెడితే వాళ్ళేదో అంటారు అనవసరంగా గొడవవుతుంద"అన్నది అరుణ.

"మీ కెవరు చెప్పారీ సంగతులు? విశ్వమా?"

"కాదు. వాళ్ళే చెప్పారు."

"వాళ్ళు మీకెలా కలిశారు?"

"నిన్న మా ఇంటి కొచ్చారు"

"ఐసీ! అక్కడ తగాదా జరిగిన వెంటనే వాళ్ళు అర్జంటుగా మీ దగ్గర కొచ్చేశారన్నమాట! ఆ సమయంలో వాళ్ళందరికీ అంత ఆత్మీయంగా మీరే గుర్తు రావటం ఆశ్చర్యంగా ఉంది కదూ?"

అప్పటికి ఆమెను నేనెటు లాక్కెడుతున్నానో అర్థమయింది అరుణకు. వామనరావు కూడా ఆమెను అనుమానంగా చూశాడు.

"ఐతే ఇవన్నీ నేనే కల్పించానా?" రోషంగా అందామె.

వామనరావుకు నేనంటే ఇష్టం.భారతి మీద కూడా అతనికి గుడ్ ఒపీనియన్ ఉంది.అరుణ గొడవ భరించలేక....ఎందుకైనా మంచిదని ఈ విషయం నాకు చెప్పలేక బలవంతంగా చెపుతున్నట్లుందతని ముఖం ఇందులో అరుణపాత్ర ఏదయినా ఉందా అనే అనుమానం మొదటిసారిగా కలిగిందతనికి.

"నేనలా అనలేదు. మీరే ఊహించుకుంటున్నారు." అనేసి చరచరా ఇంటికొచ్చాను. ఇంక విశ్వం దగ్గర కెళ్ళాలనిపించలేదు. మనసంతా చేదుగా ఉంది.

"విశ్వం నాలుగయిదు రోజులున్నించీ రావటం లేదేం? ఊళ్ళోలేడా?" అమాయకంగా అడిగింది భారతి.

"పోనిద్దూ, అతని గొడవ మనకెందుకూ...." ఉదాసీనంగా అన్నాను.

ఆశ్చర్యంగా చూసిందామె.

వామనరావింట్లో జరిగిన సంభాషణంతా చెప్పానామెకు. భారతి ముఖం తెల్లగా పాలిపోయింది. కిందిపెదవిని పై పంటితో నొక్కిపట్టి ఏడుపు నాపుకోవటానికి ప్రయత్నిస్తోంది. కాలి బొటనవేలు నుంచి తలలోవరకూ రక్తం అత్యధిక వేగంతో పరుగులు పెడుతున్నట్లుందామెకు. ఆసరాకోసం అన్నట్లు టేబులు అంచును గట్టిగా పట్టుకుంది.

"మీరు.. మీరే మనుకుంటున్నారు?" అడగలేక అడిగింది.

"నేనిలాంటివన్నీ లెక్కచెయ్యను. మన పెళ్ళయిన కొత్తలో ఎదురింటామె ఏమంది?"

నేను నల్లగా, నువ్వు తెల్లగా ఉన్నామని. "మనిద్దరిదీ ఒక కులం కాదేమో .... నేను నిన్ను లేపుకొచ్చానేమో" అనుకున్నామని చెప్పలేదూ? మనం ఎంత నవ్వుకున్నాం! ఈ మనుషులు....అందులో మీఆడవాళ్ళు నిజానిజాలు తెలుసుకోకుండా

ఎదటివాళ్ళను గురించి తామే ఏదేదో ఊహించుకుంటారు.

ఊహేమిటి.... ఖచ్చితంగా అది నిజమే అనేసుకుంటారు. ఆ నిజం నలుగురికీ తెలియజెయ్యాలనే ఉబలాటంతో అన్నం కూడా మానేసి ప్రచారం చేస్తారు. అలా ప్రచారం చెయ్యటానికి వీలుకుదరకపోతే.... బెంగెట్టేసుకుని ఇంకపై నాలుగ్గంటల్లో ఛామ్మని చచ్చూరుకుంటారు....

"నేనెందుకు నమ్ముతానీ దరిద్రపు సంగతులు?" అన్నాను నేను.

నేనెంత చెప్పినా భారతి ముఖంలో బాధ యాతన పోగొట్ట లేకపోయాను....

కిటికీలోంచి యాదాలాపంగా చూస్తే విశ్వం కనపడ్డాడు.

"విశ్వం వస్తున్నాడు" అన్నాను

"అతను లోపలికి రాకముందే మీరు బయటకెళ్ళండి. నేన తని ముఖం చూడలేను కాలేజీ రోడ్డులోకి పోయిమాట్లాడుకోండి" అంటూ నన్ను గెంటేసింది భారతి. నేనే అతనికి ఎదురెళ్ళి భుజం మీద చెయ్యేసి కాలేజీరోడ్డువేపు తీసుకెళ్ళాను. కొంచెం దూరం నడిచి రోడ్డుపక్కగా ఉన్న జవహర్ పార్కులో కూర్చున్నాము.

"ఇంట్లోకి రానివ్వకుండా మీరు నన్నిక్కడికెందుకు తీసుకొచ్చారో నాకు తెలుసు. భారతిగారు నా ముఖం చూడనన్నారు కదూ?" వాడిన ముఖంతో అన్నాడు విశ్వం.

"సారీ విశ్వం. భారతెప్పుడూ అంత తొందరపడదు. ఈ రోజెందుకో...." గిల్టీగా ఆగిపోయాను.

"ఆవిడ తప్పేం లేదు. నామీద ఉంచిన నమ్మకాన్ని నేనే కాపాడుకోలేకపోయాను."

"ఏం జరిగిందసలు?"

ఇందులో ముఖ్య పాత్రధారిణి అరుణ. ఆమెకు తనకన్నా అందమైన, చదువుకున్న భారతిగారంటే జెలసీ. నేను తనతో ముభావంగా ఉంటూ.... భారతిగారితో చనువుగా, అభిమానంగా ఉండటం ఆమెకు మరింత అసూయను కలిగించింది...."

"వాళ్ళు మేమూ ఫామిలీ ఫ్రెండ్స్‌మి. ఇంత చిన్న విషయానికి అరుణ ఇంత దారుణంగా ... కొంపలు కూల్చేలా ప్రవర్తించిందంటే.... నిజంగా నమ్మలేకపోతున్నాను."

"అరుణ లాంటి ఆడవాళ్ళు కాలాంతకులు. వాళ్ళు చెయ్యలేని పనులంటూ వుండవు."

అరుణ తరుచుగా మా ఇంటికొచ్చి ఎంతో స్నేహం నటిస్తూ.... మా వాళ్ళను వాళ్ళింటికి తీసికెళ్ళి అనవసరపు మర్యాదలు చేస్తూ రంగం సిద్ధంచేసింది.

ఆ తర్వాత.... నేను భారతిగారికి రోజూ ట్యూషన్ చెప్పే వంకతో మీ యింటికి వచ్చి.... రాత్రి పదింటిదాకా అక్కడే




గడుపుతూ ఆమెతో అతి చనువుగా వుంటున్నానని మా వాళ్ళకి ఇంజక్టు చెయ్యటం మొదలెట్టింది.

"ఇప్పటికైనా కళ్ళు తెరుచుకో. మీ ఆయన్ని వాళ్ళింటికి పోనివ్వకు. ఆ భారతి నీకన్నా అందమైనది. తెలివైనది. ఆవిడ మాటల మత్తులో మీ ఆయన పూర్తిగా కూరుకుపోయాడంటే.... యింక నువ్వెంత మొత్తుకున్నా లాభం వుండదు. భారతంటే అంత లవ్వుండబట్టే.... ఆ సమయం ఆవిడ గురించి నీ దగ్గర దబ్బా కొడుతుంటాడు. నీ కాపురం కూలగొట్టుకోకు నీ అమాయకత్వంతో." అంటూ మా ఆవిడకు నూరిపోసింది.

నెల రోజులక్రితమే. నేను మీ ఇంటికి రావటం గురించి మా ఆవిడ వివాదం లేవదీసింది. నాకా ఉద్దేశ్యాలు లేవుగనక నేనంతగా దీనికి ప్రాముఖ్య మివ్వలేదు.

"ఊళ్ళో ఇంకెవరూ లేరా? ఆవిడకు మీరే ట్యూషన్ చెప్పాలా? మీరు వాళ్ళింటికెళ్ళటానికి వీల్లేదని తగులుకుంది నిన్న. రేణూ వాళ్ళమ్మా, నాయనమ్మాతూ నా రేణుకకు సపోర్టుగా నానా మాటలూ అడిగారు. పెద్ద రగడ అయింది.

నాకూ చిర్రెత్తుకొచ్చి వాళ్ళందర్నీ పట్టుకుని ఛడామడా దులిపాను.

ఈ సంగతి ఇంత త్వరగా మీ దగ్గరకొచ్చేసి భారతిగారి మనసు విరిచేస్తుందనుకోలేదు నేను.

ఈ విషయంలో కూడా అరుణే పుణ్యం కట్టుకుందన్నమాట.

నేనే భారతిగారికి నొప్పికలగకుండా వ్యవహారమంతా చెప్పేసి మీ ఇద్దరి సలహా తీసుకోవాలనుకున్నాను. చివరికి ఇదంతా వికటించి ఆవిడ నా ముఖం కూడా చూడకుండా బయటకు తరిమేశారు...." తడిగా వున్న కంఠంతో అన్నాడు విశ్వం.

"భారతి కాస్త సెన్సిటివ్. కొన్నాళ్ళుపోతే సర్దుకుంటుంది" అన్నాను నేను.

"ఆడవాళ్ళలో అంత ఓర్పు, వివేకం కలిగిన వాళ్ళు అరుదుగా ఉంటారు. నా భార్యను కూడా ఆవిడ శిక్షణలో అలా మలుచుకోవాలనుకున్నాను. భారతిలాంటి అక్కను పోగొట్టుకున్నాను.

కొన్నాళ్ళయినా....నో! పగిలిన అద్దం అతకదు. అతికినా అసహ్యంగానే వుంటుంది.

ఆ గిల్టీ కాన్షస్ నాలోనూ పోదు. ఆమెలోనూ పోదు. వస్తాను గుడ్ బై. భారతక్కకు చెప్పండి. ఇంకెప్పుడూ ఆమెకు నాముఖం చూపించనని" అంటూ బరువుగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు విశ్వం.

"నువ్వు తొందరపడ్డావు భారతీ. అతను లోపలికొస్తే ఏం? మధ్యన అతనేం చేశాడు? చాలా ఫీలయ్యాడు. నాకుమాత్రం బాధ లేదనా? నీ భార్యకు ఎవడితోనో సంబంధం వుందిట' అని వాళ్ళన్నప్పుడు ఎంత వేదన అనుభవించానో నీకేం తెలుసు? అయినా నేను నిగ్రహంగా లేనూ?" అన్నాను భారతితో.

"నా మానసిక పరిస్థితి వర్ణించటానికి మాటలు సరిపోవండీ. నెలరోజుల క్రితం ఈ వివాదం తలెత్తితే అతనేం చేస్తున్నాడు? నాకు చూచాయగా చెప్పొచ్చుగా? ఇలాంటివి మొగ్గలోనే తుంచెయ్యాలి. భార్యను కంట్రోల్‌లో పెట్టుకుని, నేర్పుతో ఆమెను కన్విన్స్ చేసుకునే కెపాసిటీ లేనప్పుడు అతనే మనకు దూరంగా జరగాల్సింది.

ఇలా మానసికంగా మర్డర్ చేస్తే ఎంత ఘోరంగావుంటుంది. అతనితో పెంచుకున్న అనుబంధాన్ని స్నేహాన్ని చటుక్కున తెంపేసుకోలేం. అలా అని అతనితో ఇంక ఫ్రీగా ఉండలేం...." కళ్ళు తుడుచుకుంటూ అన్నది భారతి.

అందమైన భార్యను కలిగివున్న మగాడిగా ఈ జీవితంలో ఇంకా ఎన్ని ఎదుర్కోవాలో?